


["Forgive us, O Lord, we acknowledge ourselves of the common man,

Of the men and women, who shut the door and sit by the fire."

"Small folk who live among small things" T S. Elliot.]

* * *

"లేస్తారా, టైమ్ ఆరయ్యింది"

My god, అప్పుడే ఆరయ్యిందా?!

బ్రష్‌మీద పేస్ట్ వేసుకుని బాత్రూమ్‌కి

పరుగు పరుగు పరుగు.

అప్పుడే పేస్టయిపోయిందే! కొని ఎన్ని రోజులయిందో? ఈసారి బాక్స్‌మీద డేట్ వెయ్యాలి.

"రాజీ, ఓ గ్లాస్తో వేణ్ణీళ్ళివ్వు."



అయ్యబాబోయ్ చచ్చాను
అలా దొరికట్టుంగా కూర్చుంటారేం?

షేవింగ్ సోప్‌కూడా ఐపోవచ్చింది. బహుశా రెండూ ఒకేసారి కొని వుంటాం. వెధవ బ్లేళ్ళు సరిగా తెగిచావవు.

"కాఫీ ఇప్పుడిచ్చెయ్యమంటారా — బాత్ చేసిం తర్వాత తాగుతారా?"

"కాఫీ ఇటిచ్చి, బాత్రూమ్‌లో నీళ్ళు పెట్టు."

కాఫీలో పంచదార తక్కువ. అంటే అసలు ఇంట్లోనే నిండుకుని వుండాలి. లేకపోతే రాజీ నాకెప్పుడూ సుగర్ తక్కువెయ్యదు.

"రాజీ, సుగర్ "

"లేదండీ, ఐపోయింది"

మొదలు!

లేదు లేదు లేదు.

బాత్రూమ్ గుమ్మం ఎప్పుడూ మాడు పగిలేలా తగుల్తూనే వుంటుంది. నీళ్ళెప్పుడూ గోరు వెచ్చనకంటే ఎక్కువ వెచ్చగా వుండవు.

"రాజీ సోప్ "

"లేదండీ, ఐపోయింది"

లేదు లేదు లేదు.

"ఇవాళ తాఢీకెంత రాజీ"

"ఇరవై రెండనుకుంటాను, చూస్తానుండండి. ఇవాళ సోమవారంకదూ? ఇరవై ఒకటి"

(పేస్ట్ లేదు, పంచదార లేదు, సోప్ లేదు. ఇక ఇంట్లో బియ్యంకూరలు పప్పులూ వున్నాయా? అడగడం అనవసరం. అన్నీ ఒకె సారి క్లైమాక్స్‌కి వచ్చాయే?

అవునంతే, అతనంతే!

ఇంటర్‌వెల్‌లోనే క్లయిమాక్స్‌కి వచ్చిన సినిమా అతని బ్రతుకు)

"టిఫిన్ బావుంది. కొంచం చట్నీ వెయ్యి రాజీ"

"అన్నట్టు చెప్పడం మర్చిపోయానండీ, డాక్టరుగారబ్బాయి చెప్పాడు — ఫాక్టరీనించి ఫోనొచ్చిందిట—మిషనేదో ట్రబులిచ్చిందిట. వెంటనే రమ్మని"

టైమ్ అప్పుడే 7—45!

టిఫిన్‌బాక్స్ తీసుకుని పరుగులాంటి నడకతో సిటీ బస్టాండువైపు కదిలాడు.

("మధ్యాహ్నం లంచికి వస్తారా? పోనీ సాయంత్రమైనా తొందరగా వస్తారా?" ఆమె వెయ్యని ప్రశ్న.

"ఏమో, ఎట్లా చెప్పగల్ను. ట్రై చేస్తాను"

అతను ఇయ్యని జవాబు.

అవును, అతనుమాత్రం ఎట్లా చెప్పగల్డు— అతని చేతిలో లేంది.)

*　　*　　*

పరుగు　పరుగు. పరుగు.

ఏడూ ఏభై కో బస్సుంది. అది దాటితే మళ్ళీ ఎనిమిదీ ఐదుక్కానీ లేదు. ఎప్పుడూ అనుకుంటూ వుంటాడుతను—ఓ సైకిల్ కొనుక్కోవాలని. ఇంటిలో సరుకులే నెలకు తగ్గట్టు కొనలేనివాడు సైకిలేం కొనుక్కోగల్డు?

ఫాక్టరీ!

"సారిసర్, కొంచం లేటయ్యింది."

"ప్రతీరోజూ లేట్‌గావస్తే ఎలాగ రామూరావ్! ఇంకోసారి యిలా జరిగితే ప్రొడక్షన్ సూపరింటెండెంట్‌కి రిపోర్టు చెయ్యాల్సి వస్తుంది' ప్రొడక్షన్ ఇంచార్జ్.

"ఇంకెప్పుడూ యిలా జరగదు సర్."

"సర్లే, ముందా మిషన్ సంగజ్జూడు."

"ఓకేసర్. అన్నట్టు మనింట్లో వాటర్ మోటరు సరిగ్గా పన్చేస్తోందా సార్?"

"మనమంతా బానిసలం,
గానుగలం పీనుగులం!
మనదీ ఒక బ్రదుకేనా?
కుక్కలవలె నక్కలవలె!
మనదీ ఒక బ్రదుకేనా
సందాలలో పందాలవలె!"

*　　*　　*

అక్కణ్ణించి టైము పందెం గుఱ్ఱంలా పరిగెడుతుంది. మిషనరీ ట్రబుల్స్, ఎలక్ట్రికల్ ట్రబుల్స్, ఫాక్టరీ పర్చేజెస్.

తన వర్కింగ్ అవర్స్ పేరుకి మాత్రం ఉదయం ఎనిమిదినుంచి సాయంత్రం ఆరు వరకూ. మధ్యాహ్నం 12 గం॥నుంచి రెండు వరకూ లంచ్‌టైము. కానీ ఎప్పుడూ లంచ్‌కి యింటికి వెళ్ళడానికి టైముండదు. రోజూ రాత్రి ఏడూ, ఎనిమిదీ ఐపోతుంది. ఒక్కోరోజు రాత్రి పదీ, పదిన్నరకూడా ఔతుంది. విసుగ్గా వుంటుంది. పనిచేసి చేసి వచ్చిన శరీరానికి కొంచం ఆహారం పడగానే వెంటనే నిద్ర ముంచుకొచ్చేస్తుంది.

మళ్ళీ ప్రొద్దున్నే

"ఏవండీ, ఆరయింది. లేస్తారా?"

మామూలే!

ఎన్నాళ్ళిలా?

"బ్రదుకు వృధా చదువు వృధా!
లేదు సుఖం లేదు సుఖం
లేదు సుఖం జగత్తులో,
లేదు సుఖం లేదు రసం
చేదు విషం జీవఫలం."

*　　*　　*

(మామూలు రోజుల్లో అట్లా సాగిపోయే అతని జీవితం ఆదివారాల్లోకూడా ఏమీ తేడా వుండదు. ఆదివారంకూడా పని వున్నరోజుల్లో ఐతే,ఆ రోజూ మామూలు రోజు లాగానే సాగుతుంది. వర్కులేని ఆదివారాలు అతను ఉదయం పదిగంటలవరకూ లేవడు. తర్వాత మధ్యాహ్నం భోంచేసి మళ్ళీ పడుకుంటాడు. సాయంత్రం లేచిన్తర్వాత, బతికున్న రోజుల్లో (అంటే అతని భాషలో, నెల మొదటి రెండు ఆదివారాలు) ఐతే యిద్దరూ ఏదైనా హోటల్లో భోజనంచేసి, ఏదో ఒక సినిమాకి తుమ్ముకుంటూ, తొక్కుకుంటూ వెళ్తారు. సినిమాలో ఏక్టర్ ఏడిస్తే ఏడుస్తారు, నవ్విస్తే నవ్వుతారు. చివరికి ఏడుస్తూ యింటికి చేరుకుంటారు. తెల్లారిన తర్వాత మళ్ళీ రొటీన్‌లో పడిపోతారు.

పదోసారి చూసే సినమాలా, అతని జీవితం అతనికే విసుగు కలిగించడంలో ఆశ్చర్యమేముంది?)

*　　*　　*

ఆ రోజు.

"లేస్తారా, ఆరయింది"

పేస్ట్　షేవింగ్ సోప్　బాత్ సోప్.

లేవు! ఐపోయాయి!

"ఇవాళ తారీకెంత రాజీ"

"ఖర్మ, మీకేదీ గుర్తుండదు. ఇవాళ ఫస్టండీ బాబూ"

అవునుకదూ! ఈ రోజైనా కాస్త ఎర్లీగా



వెళ్ళాలి. నిన్ననే ఇన్‌స్టాల్ చేసిన కొత్త మిషన్ స్మూత్‌గా రన్ ఔతోందో లేదో!

* * *

"గుడ్ మార్నింగ్ సర్"

కొత్తమిషన్ చెక్ చేశాను. ఎవరిథింగ్ ఈజ్ ఓకె. ఫాక్టరీకి కావల్సిన లిక్విజిషన్స్ రాయిస్తున్నాను.

ఫోన్ మోగింది.

"రామారావ్, నీకు "

ఆఫీసునుంచి! ఎకౌంటెంట్ రావుగారు.

"అలాగే సార్ వస్తున్నా సార్"

ఈ రోజు కాషియర్ శలవుట, అకౌంట్స్ క్లర్కూ, టైపిస్టూకూడా శలవు పెట్టేరుట. ఇవాళ పే డే?

బాంకునించి డబ్బు డ్రా చెయ్యాలి. ఆయన స్టేట్‌మెంట్స్ ప్రిపేర్ చేస్తున్నారుట. నేను బాంక్‌కి వెళ్ళి డబ్బు డ్రా చేసుకురావాలి. పనిలో పని ఫాక్టరీ పర్చేజెస్ కూడా అప్పుడే చేసేస్తే సరి.

* * *

నా జీతం నాలుగువందలు. పి.ఎఫ్; ఇ.ఎస్.ఐ మొదలైన కటింగ్స్‌పోను మామూలుగా మూడు వందల యాభై చేతికొస్తుంది.

క్రితంనెల ఇరవై మూడవ తేదీని తీసుకున్న ఎడ్వాన్స్ వందాపోను, ఈ రోజు తన చేతికొచ్చేవి రెండువందల యాభై. ఏం బతుకు తనది! ఛీ!

* * *

"రామారావ్, ఇప్పుడు ఫాక్టరీ పర్చేజెస్ అవీ ఏమీ పెట్టుకోకు. వెళ్ళేటప్పుడు ఎట్లా వెళ్ళినా వచ్చేటప్పుడు మాత్రం ఆటోలో రా. కాష్ జాగ్రత్త!"

తను అప్పుడప్పుడు బాంక్‌నించి కాష్ తేవాల్సివచ్చినా, వెళ్ళినప్పుడల్లా అకౌంటెంట్ గారు చెప్పే జాగ్రత్తలు వినక తప్పదు. ఇప్పుడూ ఆయన హితబోధ విని కాష్‌బాగూ, ఏభై వేలకి పి. ఎన్. బి. చెక్కు తీసుకుని బయల్దేరాను.

రిక్షాలో బాంకుకి వెళ్తున్నానే కానీ, ఆలోచనలు మాత్రం నన్ను వెంటాడడం మానలేదు. మనసులో బాలన్స్ షీటు వేస్తున్నాను.

జనరల్‌స్టోర్స్‌వాడికి ఇవ్వాల్సింది రూ. 150

ఎలక్ట్రిసిటీ బిల్లు, ధోబీ, మిగిలిన చిల్లర ఖాతాలు రూ. 100

ఫాక్టరీ దగ్గర కాఫీహోటల్‌కి రూ. 70

అంటే డెభై రూపాయలు లోటన్నమాట. అన్నట్టు అసలు పద్దే మర్చిపోయాడతను.

ఇంటద్దె క్రితంనెల బాకీ యాభై, ఈ నెల వందా మొత్తం నూటయాభై యివ్వందే ఇంటాయన దగ్గర పరువు దక్కదు.

ఆదాయం రూ. 250

వ్యయం రూ. 450

రెండువందల ఇరవై రూపాయల డెఫిసిట్?

ఎక్కణ్నుంచి తెస్తాడు తను?

ఐ టి ఐలో చదివేటప్పుడు ఎన్ని కలలు కనేవాడు! మొదట ఎలక్ట్రికల్‌లో సర్టిఫికెట్ తీసుకున్నాడు. తర్వాత 'మెకానికల్' కూడా చేస్తే వర్క్‌షాప్ పెట్టుకోవచ్చని నాన్నే దాంట్లో చేర్పించాడు. సెకండ్ ఇయర్‌లో వుండగానే నాన్న పోయాడు. ఇంక అది పూర్తి చెయ్యడం పడలేదు. పొట్ట చేత్తో పట్టుకుని తెలిసిన వాళ్ళందరి దగ్గరికి తిరిగాడు తను, ఉద్యోగానికి. ఆఖరికి నాన్న దూరపు బంధువు ఒకాయన వాళ్ళమ్మాయినిచ్చి పెళ్ళిచేసి, యీ వుద్యోగం ఇప్పించాడు. ఆ తర్వాత సంవత్సరానికి ఆయనా పోయాడు.

ఇప్పుడు తనూ, రాజీ. ఇద్దరే.

ఒంటికాయ సొంటికొమ్ము!

అప్పుడప్పుడు అన్పిస్తూ వుంటుంది—పెళ్ళి ఎందుకు చేసుకున్నా నా అని. నేను బాధపడ్డమేం కాకుండా రాజీని కూడా బాధపెడ్తున్నాను.

తనని కట్టుకుని ఏం సుఖపడింది రాజీ?

"పంజాబ్బేంకు వచ్చింది బాబుగారూ!"

రిక్షావాడి మాటల్తో ఈ లోకాని కొచ్చాను.

ర ర ర

ఎర్లీగా వెళ్ళడంతో తొందరగానే చెక్ కాష్ చేసుకుని ఇవతలికి వచ్చాను. కనిపించిన ఆటోలో కూర్చుని "ఆటో నగర్ పోనీ" అన్నాను.

ఆటో బందరు రోడ్లో నెమ్మదిగా పోతోంది.

అరె! తను ఆఫీసుకి కదూ పోవాల్సింది!

"ఆటో నగర్ కాదు, సూర్యారావు పేట పోనీ బాబూ."

ఆటో డ్రైవర్‌తో చెప్పాను. అతను నాకేసి అదోలా చూసి ఆటోని సర్రున వెనక్కి తిప్పాడు. ఆ తిప్పడంలో నా వళ్లోవున్న కాష్ బాగ్ కాళ్ళదగ్గర పడింది.

అందులో డబ్బు-యాభై వేలు-వుంది!

సడెన్‌గా కళ్ళు తిరిగాయి నాకు.

"ఆపు!" అరిచాను. జేబులో వున్న ఒకే ఒక ఐదురూపాయల నోటూ అతనికిచ్చి పక్కనున్న హోటల్‌కి దారితీశాను.

* * *

అవును? తన సమస్యలన్నింటికీ అదే పరిష్కారం? పాపం, పుణ్యం—అంతా క్రాప్. ఈ యాభై వేలతో తను చక్కటి భవిష్యత్తుకి పునాది వేసుకోవాలి.

అంతా జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలి. ముందు ఆఫీసుకి, బాంక్‌లో రష్‌గా వున్నట్టూ ఓ రెండుగంటలు లేటవుతుందనీ ఫోన్ చెయ్యాలి. తర్వాత ఆం, తర్వాత వెంటనే తనిక్కణ్ణుంచి యింటికి వెళ్ళిపోవాలి అహం కాదు. పక్కింటి డాక్టరుగారికి ఫోన్‌చేసి రాజీని రెడీగా వుండమని చెప్పాలి. వెంటనే రైల్వే స్టేషనుకి నో, ట్రైన్లో వెళ్ళకూడదు టాక్సీ యస్, టాక్సీలో హైదరాబాదు అహం కాదు, మద్రాసు వెళ్ళిపోవాలి. అక్కణ్నుంచి-తనకి మైసూర్‌లో రెలిటివ్స్ వున్నారు. మైసూర్ వెళ్తే? వద్దు, చుట్టాలింటికి వెళ్ళకూడదు. బెంగుళూరులో తన క్లాస్‌మేట్ మూర్తి వర్క్‌షాప్ పెట్టుకున్నట్లు రాశాడు. బెంగుళూరు వెళ్ళాలి. అక్కడే తను కూడా ఓ వర్క్‌షాపు పెట్టుకుంటే సరి. ఎట్లాగెగా నెలకో వెయ్యిరూపాయలు సంపాయించొచ్చు. అప్పుడు ఓ స్కూటర్ కొనుక్కుంటే సరి తనూ రాజీ యెంతో హాయిగా కాలం గడపచ్చు.


పిచ్చిరాజీ! తనని ఒక్కసారి కూడా హైక్లాస్ టిక్కెట్టుకి సినిమాకి తీసికెళ్ళలేక పోయాడు! ఏ.సీ హోటల్లో మీల్స్ పెట్టించలేకపోయాడు.

బెంగుళూరులో హాయిగా

"సార్, టీ."

సర్వర్ గొంతువిని అంతెత్తున ఉలిక్కిపడ్డాను. రెండుగుక్కల్లో టీ తాగి జేబులోవున్న చిల్లరడబ్బుతో బిల్లు చెల్లించి బైటపడ్డాను.

ఫోన్లు రెండూచేసి, కనిపించిన '28' ఎక్కాను. ఇంజను పక్కగావున్న ఫ్రంట్‌సీట్ ఖాళీగా ఉండడంతో కూర్చోక తప్పింది కాదు కానీ తెలిసిన వాళ్ళెవరికంటా పడకూడదు. ఎట్లా? చప్పున కాలేజీ స్టాప్ వస్తే బావుండును.




తన ఇల్లు ఎస్. ఆర్. ఆర్. కాలేజీ ప్రక్క సందులో!

○ ○ ○

"అంతా బస్సు దిగండి ప్లీజ్."

బస్సుచుట్టూ ఓ రెండు మూడువందల మంది కాలేజీ స్టూడెంట్స్ గోలగోలగా స్లోగన్స్ షౌట్ చేస్తున్నారు. బస్సుని తగలబెట్టడాని కనుకుంటాను. అందర్నీ దిగమంటున్నారు. స్టూడెన్స్ బస్సుచుట్టూ వుండడంతో, బస్సులో వాళ్ళెవరూ భయంతో దిగటంలేదు.

ఈలోగా రాళ్ళవర్షం ప్రారంభం అయ్యింది. మొదటిరాయి నా నుదిటిమీద తగిలింది. తర్వాత వరుసగా భుజాలమీద, గుండెల మీద, వీపు మీదా రాళ్ళు తగుల్తున్నాయి. బస్సులో జనాన్ని తోసుకు దిగుదామని ఎంత ప్రయత్నించినా కుదరటం లేదు. నుదిటిమీద నుంచి ఒంటిమీద నుంచి రక్తం కారుతోంది కళ్ళు తిరుగుతున్నాయి. ఫుట్‌బోర్డు మీదనుంచి కాలు కింద పెట్టి రోడ్డుమీద బోర్లా పడిపోయాను.

"సిటీ బస్సులు-జాతీయం చెయ్యాలి."

స్లోగన్లు విన్పిస్తున్నాయి. ఈలోగా నన్నెవరో పక్కకి లాగేశారు. బస్సుమీద పెట్రోలు పోసి నిప్పుపెట్టడానికి ట్రై చేస్తున్నట్లున్నారు. అంతలో మూడుపోలీసు వాన్లు అక్కడికి వచ్చాయి. దాంతో స్టూడెంట్సందరూ చెల్లాచెదరై పోయారు.

నాకు కళ్ళు తిరుగుతున్నాయి. మసకలు

స్పృహ తప్పేట్టు వుంది.

నో! నేను ఫెయింట్ కాకూడదు. అంత సీరియస్ స్థితిలో కూడా కాష్ బాగ్‌ని గట్టిగా కరచి పట్టుకున్నాను.

"ఇతని కెవరికో దెబ్బలు వాగా తగిలినట్లున్నాయి. సార్! రక్తం బాగా కారిపోతోంది. వెంటనే హాస్పిటల్ "

ఆ తర్వాత మాటలు నాకు విన్పించలేదు.

నాకు స్పృహ వచ్చేసరికి హాస్పిటల్ బెడ్ మీదున్నాను.

కాన్షస్‌లో కొచ్చాక నేను చేసిన మొదటి పని-కాష్ బాగ్ జాగ్రత్తగా వుందో లేదో చూసుకోవడం. నేను తడిమేది దేనికోసమో గ్రహించిన డాక్టరుగారు,

"నీ కాష్‌బాగ్ సురక్షితంగా వుంది బాబూ! యూ ఆర్ లక్కీ. దానిమీదున్న మీ ఆఫీసు ఫోన్ నెంబర్‌కీ, మీ పక్కింటి డాక్టరుగారి ఫోన్ నెంబర్‌కీ రింగ్ చేశాము. మీ అకౌంటెంట్ గారూ, మీ మిసెస్ వస్తూ వుంటారీపాటికి. **Now you are perfectly al right, young man. take rest."** అని వెళ్ళిపోయారు.

అవును — **Now I am perfectly alright.**

రాజీ, నాకిప్పుడెంతో సంతోషంగా వుంది, మరెంతో సంతృప్తిగా వుంది.

అనువు రాజీ—**I am the happiest fellow at this moment!** □